అర్హులకు నేరుగా సంక్షేమ పథకాలు

- దళారీ వ్యవస్థకు చెక్
- లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే నగదు
- అందుకే జగన్ మళ్లీ కావాలంటున్న ప్రజలు
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



డిజిటల్ బోర్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



బుక్‌లెట్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా ఎదిగేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. పార్టీలు, కులాలు, మతాలు, వర్గాలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను నేరుగా అందజేస్తున్న ఘనత మన సీఎంకే చెందుతుందన్నారు. జీవీఎంసీ 64వ వార్డు గంగవరం సచివాలయం-1 పరిధిలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని సచివాలయ ఆవరణలో బుధవారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు ధర్మాల శ్రీను అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గడచిన నాలుగున్నర సంవత్సరాలలో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. వీటి కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేశారని తెలిపారు. రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందించే వారు కాదని, మధ్యలో దళారులు దోచుకునేవారన్నారు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను నేరుగా అందజేస్తోందన్నారు. దళారులకు చెక్‌పెట్టి, లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకే నేరుగానగదు జమ చేస్తూ.. పారదర్శకంగా పథకాలు అందిస్తున్నారన్నారు. తమ పిల్లల చదువులకు అండగా నిలుస్తూ, తమ కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా సహకరిస్తున్న జగనన్నే మళ్లీ కావాలని ప్రజలు కోరుతున్నారన్నారు.

గంగవరం-1లో 31.78 కోట్లతో సంక్షేమ పథకాలు

గాజువాక నియోజకవర్గ పరిధిలోని గంగవరం గ్రామంలో 900 మందికి ఇళ్ల పట్టాలు అందజేశారని ఎమ్మెల్యే తెలిపారు. ఇప్పటి వరకు సచివాలయం పరిధిలో రూ. 31.78 కోట్లు సంక్షేమానికి ఖర్చు చేశామన్నారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. సంక్షేమ పథకాలను వివరించే డిజిటల్ బోర్డును సచివాలయంలో ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన ప్రజలు

క్లుప్తంగా

డిసెంబర్ 1, 2 తేదీల్లో బాలోత్సవ్



చిల్డ్రన్స్ ఫెస్టివల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ గంగారావు, చిల్డ్రన్ క్లబ్ ప్రతినిధులు

ఉక్కునగరం: బాలబాలికల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు డిసెంబర్ 1,2 తేదీల్లో నిర్వహించనున్న చిల్డ్రన్స్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయాలని జీవీఎంసీ 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు కోరారు. ఉక్కు అధికారుల సంఘం భవన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ రెండు రోజులు 20 అంశాలతో పాటు 14 సాంస్కృతిక అంశాలతో పోటీలు జరుగుతాయన్నారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో జరిగే ఈ పోటీల్లో అన్ని ప్రభుత్వ, మున్సిపల్, ప్రైవేట్, ఎయిడెడ్, కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఎం.ఎస్.ఎన్.మూర్తి, కె.సుశీల, ఆర్.నరసింహ, కె.వి.ప్రసాద్, జె.నూకరాజు, టి.చిరంజీవి, ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: నెల్లిముక్కు ప్రజల ఆరాధ్యదేవత కుంచుమాంబ ఆలయం పక్కనున్న ఖాళీ స్థలాన్ని భవిష్యత్ అవసరాలకు వినియోగించే విధంగా చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తెలిపారు. 75వ వార్డు నీలాపువీధిలో శివారున గల కుంచుమాంబ ఆలయం పక్కన రూ.40లక్షలతో చేపట్టనున్న ప్రహరీ నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు పనులు వేగవంతం చేయాలని వినతి



కమిషనర్ సాయికాంత్ వర్మకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, బోగాది

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెం నుంచి కూర్మన్నపాలేనికి వెళ్లే మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులు వేగవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మను కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితో కలిసి కమిషనర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు.

రేపు మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో కర్లికల్, టెక్నికల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 17న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్) ప్రకటనలో పేర్కొన్నారు. అపోలో ఫార్మసీ, వరుణ్ మోటర్స్, శ్రీరామ్ చిట్స్, ముత్తూట్ ఫైనాన్స్, టాటా క్యాపిటల్, దక్కన్ ఫైన్ కెమికల్స్, స్పెక్ట్రమ్ టాలెంట్ మేనేజ్‌మెంట్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 500 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. రిటైల్ ట్రెనింగ్ అసోసియేట్, ఫార్మాసిస్ట్, జూనియర్ ట్రేనీ, డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, ఆఫీస్ అసిస్టెంట్, అకౌంట్స్, అసిస్టెంట్, రికవరీ, క్లర్క్, బ్రాంచ్ ఇన్‌చార్జి, వేర్ హౌస్ ఎగ్జిక్యూటివ్స్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పీజీ, 18-35 ఏళ్ల వయసు గల పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు.ఉపాధి కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు.

ఒడిశావాసి ఆత్మహత్య



అభినాష్ సాహు మృతదేహం

పెదగంట్యాడ: ఒడిశాకు చెందిన ఓ యువకుడు మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అభినాష్ సాహు (22) అనే యువకుడు తల్లిదండ్రులు, సోదరుడితో కలసి భానోజీతోట రోడ్డు నంబర్-6లోని ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. కోరమాండల్‌లోని ఓ కాంట్రాక్టర్ వద్ద ఆరు నెలలుగా ఎలక్ట్రికల్ పనులు చేసుకుంటున్నాడు. రోజూ మాదిరిగానే మంగళవారం విధులకు వెళ్లి వచ్చిన అభినాష్ రాత్రి 9 గంటల సమయంలో ఇంట్లోని ఓ బెడ్‌రూమ్‌లో నిద్రపోయాడు. వేకువజామున 5 గంటల సమయంలో అతని తల్లి నిద్రలేచి చూడగా అతడి గది లోపల గడియపెట్టి ఉంది. తలుపు తట్టినా తీయకపోవడంతో కిటికీలో నుంచి చూడగా చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. ఆమె రోదిస్తూ మిగిలిన కుటుంబ సభ్యులను లేపడంతో పాటు చుట్టుపక్కల వారు వచ్చి తలుపు విరగ్గొట్టి అతడిని కిందకు దింపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. 'తనతో పాటు తన సోదరుడు కూడా కోరమాండల్‌లో ఓ కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్నాడని, పని ఒత్తిడి కారణంగా రోజూ ఒళ్లు నొప్పులు వస్తుంటాయని, అలాగే.. తమ సోదరి పెళ్లి కోసం అప్పులు చేశామని, తీవ్ర ఒత్తిడికి లోనై తన సోదరుడు ఆత్మహత్య చేసుకున్నాడని' మృతుడి సోదరుడు దుష్మంత్ సాహు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏఎస్‌ఐ రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గౌరమ్మకు సారె సమర్పణ



గౌరీపరమేశ్వరులకు సారె తీసుకువస్తున్న మహిళలు, సంఘం సభ్యులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు తెలుకుల సేవా సంఘం ఆధ్వర్యంలో గౌరీపరమేశ్వరుల మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా స్థానికులు బుధవారం గౌరమ్మకు సారె సమర్పించారు. సారెను ఊరేగించిన అనంతరం అమ్మవారి దగ్గర ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, సంఘం అధ్యక్షుడు చిత్రాడ రాజు, గణేష్, అడారి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నాతయ్యపాలెంలో..

అక్కిరెడ్డిపాలెం: అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెంకు చెందిన గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో గౌరీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 69వ వార్డు నాతయ్యపాలెం సీఎస్ఆర్ కల్యాణ మండపం వద్ద జరుగుతున్న పూజా మహోత్సవాల్లో సేవా సంఘం అధ్యక్షుడు దాడి వెంకట రమేష్, కార్యదర్శి కాళ్ల రాజబాబు, కోశాధికారి భీశెట్టి అప్పారావు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

- 69వ వార్డు వెంకటేశ్వర కాలనీలో జరుగుతున్న గౌరీ పరమేశ్వరుల మహోత్సవాల్లో బుధవారం గౌరీ సేవా సంఘం మహిళా ప్రతినిధులు మళ్ల శ్రీలక్ష్మి, అడారి అయమ్మ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు.. ప్రజల సొత్తు



1007వ రోజు ఉక్కు దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశ ప్రజల సొత్తు అయిన విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ అందరి బాధ్యత అని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ ఊసే ఎత్తకుండా, రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 1007వ రోజు సంస్థకు చెందిన ఎస్ఎంఎస్-2 విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల బలమైన ఆకాంక్షగా కార్మికుల బలిదానాలతో ఏర్పడి, ఉత్తరాంధ్ర జీవనాడిగా మారి, విశాఖ నగరాభివృద్ధికి దోహదపడిన స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు అమ్మేయాలనుకోవడం అన్యాయమన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ మూతపడితే వేలాది మంది కార్మికులు రోడ్డున పడతారన్నారు. ప్రభుత్వరంగంలో ఉన్న బొగ్గు గనులను ఆదానీ, అంబానీలకు ఇచ్చి, కృత్రిమ కొరత సృష్టించి విద్యుత్ ధరలు పెంచడమే కాకుండా బొగ్గు కొరతతో వేలాది బొగ్గు అధారిత పరిశ్రమలు మూతపడ్డాయని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుని ప్రభుత్వరంగ పరిశ్రమలను కాపాడాలన్నారు. ముఖ్యంగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను విరమించుకుని, ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తున్నట్లు స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యం

- ఏయూ వీసీ ప్రసాదరెడ్డి



వేడుకల్లో పాల్గొన్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: స్వయం సమృద్ధి సాధించే దిశగా ఏయూను నడిపించడమే లక్ష్యంగా అందరూ సమష్టిగా పనిచేయాలని వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి పిలుపునిచ్చారు. నాక్ ఏ డబుల్ ప్లస్ గ్రేడ్ సాధించిన నేపథ్యంలో బుధవారం పరిపాలన భవనం ఎదురుగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఏయూపరిపాలన భవనంలో పనిచేస్తున్న సుమారు ఐదు వందల మందితో కలిసి ఈ విజయాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వర్సిటీ చుట్టూ ఏర్పాటు చేసిన ఇంక్యుబేషన్ పార్కులు భవిష్యత్‌లో ఏయూకు ఆర్థిక వనరులుగా మారతాయన్నారు. వర్సిటీ ఆచార్యులు, ఉద్యోగులు, విద్యార్థులు వర్సిటీ నాది అనే భావనతో పనిచేయడం తాను గమనించానన్నారు. నాలుగేళ్ల పటిష్ట ప్రణాళిక మంచి ఫలితాన్ని అందించిందని సంతోషం వ్యక్తం చేశారు.. విభిన్న శాఖలు కలిగిన ఏయూ 3.74 సీజీపీఏ సాధించడం ఓ రికార్డ్‌గా నిలుస్తుందన్నారు. పూర్తిస్థాయిలో వర్సిటీని అభివృద్ధి చేయడానికి అవసరమైన శక్తి.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపంలో తనకు లభించిందన్నారు. రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఓఎస్డీ ఆచార్య వి.కృష్ణమోహన్, అకడమిక్ డీన్ ఆచార్య కిశోర్ బాబు, ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, డీఆర్‌లు, ఏఆర్‌లు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా టపాసులు కాల్చి వేడుకలు జరుపుకొన్నారు.

అండర్‌పాత్ వంతెన విస్తరణకు విజ్ఞప్తి

అగనంపూడి: వాహనాల రాకపోకలకు వీలుగా తలారివానిపాలెం అండర్ పాత్‌వంతెనను విస్తరించాలని అగనంపూడికి చెందిన ప్రజా సంఘాల నాయకులు ఎంపీ జీవీఎల్ నరసింహారావును కోరారు. విశాఖలో ఎంపీని కలిసిన నాయకులు వంతెన సమస్యను వివరించారు. కేవలం నాలుగు అడుగుల వెడల్పులో ఉన్న అండర్ పాత్ వంతెన చిన్న వర్షానికే మునిగిపోతుందని, దీంతో పాదచారుల రాకపోకలకు కూడా వీల్లేకుండా ఉంటోందని తెలిపారు. స్పందించిన ఎంపీ మాట్లాడుతూ రైల్వే అధికారులతో తాను చర్చించానని రూ.రెండు కోట్ల విడుదలకు రైల్వే అధికారులు సిద్ధంగా ఉన్నారని, మరో రెండు కోట్లు, జీవీఎంసీ లేదా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తే రూ.4 కోట్లతో రహదారి విస్తరణకు రైల్వే అధికారులు సిద్ధంగా ఉన్నారని తెలియజేశారు. ఎంపీని కలిసిన వారిలో బీజేపీ గాజువాక ఇన్‌చార్జి కె.నరసింగరావు, 88వ వార్డు కార్పొరేటర్ ముత్యాలు, నాయకులు బొండా ఎల్లాజీరావు, రవీంద్రరెడ్డి, నెల్లి శ్రీను, బలిరెడ్డి సత్యనారాయణ, ధర్మాల వ్యాసశర్మ ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం



శ్రీనివాసరాజు (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: బెల్లంకొండ శ్రీనివాసరాజు (43) ఈ నెల 9వ తేదీ నుంచి కనిపించడం లేదని అతని భార్య స్వాతి గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. గాజువాక వై జంక్షన్‌లో శ్రీనివాసరాజు కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నారు. ఫార్మా కంపెనీలో పని చేస్తున్న స్వాతిని డ్యూటీ నిమిత్తం ఈ నెల 9వ తేదీన ఉదయం శ్రీనగర్ బస్టాప్‌లో దించి, శ్రీనివాసరాజు వెళ్లిపోయారని, అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదని స్వాతి తెలిపారు. సెల్‌ఫోన్‌కు చేస్తున్నా స్విచ్ఛాఫ్ వస్తోందని పేర్కొన్నారు. పరిసర ప్రాంతాల్లో వెదికినా ఆచూకీ తెలియలేదన్నారు.స్వాతి ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిసినవారు 98664 55200 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



భాస్కరరావు (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: ప్రేమించిన యువతి వేరే యువకుడితో మాట్లాడుతుందని, మనస్తాపంతో పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ కేజీహెచ్‌లో మృతి చెందారు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలివి.. గాజువాక డ్రైవర్స్ కాలనీకి చెందిన కె.భాస్కరరావు (బాబీ) డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. కొద్ది నెలలుగా శ్రీనగర్‌కు చెందిన యువతిని ప్రేమిస్తున్నాడు. ఆ యువతి వేరే యువకుడితో చనువుగా మాట్లాడటం చూసిన బాబీ ప్రశ్నించగా.. ఆమె తన ఇష్టమని సమాధానం చెప్పడంతో, మనస్తాపంతో ఈ నెల 12న పురుగుల మందు తాగాడు. గమనించిన తండ్రి నారాయణరావు గాజువాకలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమించడంతో కేజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మరణించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి నారాయణరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



మిథిలాపురి వుడా కాలనీలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మధురవాడ: కూరాకుల కులాన్ని రాష్ట్రంలో అన్నిచోట్లా బీసీ - ఏ జాబితాలో చేర్చినందుకు మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలో ఆ కులానికి చెందిన పలువురు బుధవారం సంబరాలు చేసుకున్నారు. ప్రాంతీయ పరిధులు లేకుండా అందరికీ రిజర్వేషన్ కల్పించడం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి విశాఖ జిల్లా కూరాకుల సంఘం ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. కార్పొరేషన్ డైరెక్టర్ కోట ఆనంద్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సంఘాల అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్, జీవీఎంసీ 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, సచివాలయ కన్వీనర్ రమణమూర్తి, కూరాకుల సంఘం కార్యవర్గ సభ్యులు చోడవరపు వెంకట స్వామి, కోట సంజీవరావు, పి.రామారావు, చోడవరపు కరుణాసాగర్, అల్లాడ శ్రీనివాస్, కోట రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



పెదగంట్యాడ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పెదగంట్యాడ: పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని సముపార్జించుకోవాలని ఉపాధ్యాయులు ఎం.హనుకు, ఎస్.ఎస్.సుబ్బలక్ష్మి సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో బుధవారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనకు విశాఖ విమల విద్యాలయం, ప్రతిభ స్కూల్, శరత్ స్కూల్, లైఫ్‌వే పాఠశాలలతో పాటు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. అక్కడ ప్రదర్శనలో ఉన్న పుస్తకాల గురించి తెలుసుకున్నారు. 'మత్తు పదార్థాలు-పిల్లలపై వాటి ప్రభావం' అంశంపై 8,9,10 తరగతి విద్యార్థులకు, పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలపై 6,7 తరగతి విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ శాఖాధికారి పీవీ రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠకులు సురేష్, మహేష్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

గాజువాక : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గాజువాక గ్రంథాలయంలో విద్యార్థులకు బుధవారం వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. జూనియర్స్ కేటగిరీలో ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల విద్యార్థులకు పేదరికం-నిర్మూలన అంశంపై, సీనియర్స్ కేటగిరీలో తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు చంద్రయాన్ ల్యాండింగ్ అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. 60 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారని గ్రంథాలయాధికారి బి.చంద్రకళ తెలిపారు. వ్యాసరచన పోటీల అనంతరం విద్యార్థులకు గ్రంథాలయాలు, వాటి ప్రాముఖ్యత అంశంపై వక్తృత్వ పోటీలను నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ పాఠకులతో ర్యాలీ నిర్వహించారు.

బిర్సా ముండాకు ఘన నివాళి



బిర్సాముండా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యూనియన్ నాయకులు



స్టీల్‌ప్లాంట్‌లో బిర్సా ముండా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, నాయకులు

అక్కిరెడ్డిపాలెం: బిర్సాముండా జయంతిని భెల్ టౌన్‌షిప్‌లోని అంబేడ్కర్ పార్కులో బుధవారం ఘనంగా నిర్వహించారు. భెల్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి సుభాకర్ సాహు మాట్లాడారు. జార్ఖండ్ రాష్ట్రంలోని ఉలిహతు గ్రామంలో జన్మించిన బిర్సా ముండా గిరిజన అటవీజాతుల ఆరాధ్యదైవమన్నారు. ముండాలతో సైన్యాన్ని స్థాపించి నీరు, భూమి, అడవి తదితర హక్కులపై పోరాటం చేసిన వీరుడన్నారు. బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొల్లి దేముడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు బొండా బాబూరావు, పి.వి.ఎస్.రాజు, ఎం.ముసిలిరెడ్డి, జి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో..

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గిరిజన నాయకుడు బిర్సా ముండా జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్టీల్‌ప్లాంట్ డీజీఎం మనోజ్ ఓరాన్ హాజరై, అసోసియేషన్ కార్యాలయం ఆవరణలో ఉన్న బిర్సా ముండా, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ బిర్సా ముండా అతి చిన్న వయసులో ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వంపై గిరిజనులకు నీరు, భూమి, నీడ కోసం ఎన్నో పోరాటాలు చేశారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, ఎల్.వి.రమణారావు, ఎం.గణేష్, డి.పుల్లారావు, ఎస్.మోహన్‌బాబు, డి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా స్టీల్‌క్లబ్ అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న క్లబ్ అధ్యక్షుడు మధుసూదనరావు

ఉక్కునగరం: తమ పాలకవర్గం పారదర్శకంగా స్టీల్ క్లబ్‌ను అభివృద్ధి చేసిందని స్టీల్‌క్లబ్ కార్యదర్శి జి.నారాయణ దొర అన్నారు. బుధవారం స్టీల్‌క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో గత ఏడాదిగా పాలకవర్గం చేసిన కార్యక్రమాలను వివరించారు. రూ.3 లక్షలతో కళావేదిక, రూ. 2.5 లక్షలతో మరుగుదొడ్లు, దొంగతనాలు జరగకుండా కట్టుదిట్టంగా ప్రహరీ నిర్మాణం, సీసీ టీవీల ఏర్పాటు, స్విమ్మింగ్ పూల్ ఆధునికీకరణ, రూ.3లక్షలతో థియేటర్‌లో డిజిటల్ సౌండ్ సిస్టం ఏర్పాటు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. సంయుక్త కార్యదర్శి కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎటువంటి ఆరోపణలకు తావు లేకుండా పారదర్శకతతో, ఐక్యంగా క్లబ్‌ను నడిపి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామన్నారు. క్లబ్ అధ్యక్షుడు, స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్ జీఎం ఎం.మధుసూదనరావు మాట్లాడుతూ ప్రస్తుత కార్యవర్గం ఎటువంటి వివాదాలు లేకుండా ఐక్యంగా క్లబ్‌ను సమర్థవంతంగా నడిపారన్నారు. కోశాధికారి ఆర్.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతీ నెల జమా ఖర్చులను నోటీసు బోర్డులో పెట్టడం ద్వారా సభ్యులకు తమ నిజాయితీను చాటుకున్నామన్నారు. ఎన్నికల అధికారి, స్టీల్ ప్లాంట్ డీజీఎం జే.వి.రావు ఈ నెల 25న నిర్వహించనున్న కొత్త పాలకవర్గం ఎన్నికల నోటిఫికేషన్ వివరాలను వెల్లడించారు. పాలకవర్గం సభ్యులు పెంటకోట రామకృష్ణ, కె.ఎల్.నరసింహం, కె.సత్యనారాయణ, ఎన్.వీరాస్వామి, వి.ఎన్.బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహనతోనే బాల్యవివాహాలకు బ్రేక్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేసీ విశ్వనాథన్, న్యాయమూర్తి శేషమ్మ, డీఆర్వో మోహన్‌కుమార్, డీఎల్డీవో పూర్ణిమాదేవి తదితరులు

మహారాణిపేట: చట్టాలపై అవగాహనతోనే బాల్యవివాహాలను అరికట్టగలమని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ పేర్కొన్నా రు. జేసీ అధ్యక్షతన బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత అధికారులతో బాల్యవివాహాల నివారణపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, ఎవరైనా వీటికి పాల్పడినా.. సహకరించినా కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. వివాహ సమయంలో అమ్మాయిలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లుగా పేర్కొంటూ వయసు నిర్ధారణ పత్రాలు ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. దీనిపై అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఫంక్షన్ హాళ్లు, దేవాలయాలు, చర్చిలు, మసీదులు, ఇతర వేదికల వద్ద వివాహ వయసును ధ్రువీకరించే పత్రాలను సమర్పిస్తేనే అక్కడ పెళ్లి చేసేందుకు అనుమతి ఇవ్వాలన్నారు. బాల్యవివాహాలు చేస్తున్నట్లు సమాచారం అందితే.. నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పెళ్లి వేదికల వద్ద బోర్డులు ఏర్పాటు చేసి బాల్యవివాహాల దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వివాహం చేసుకున్న దంపతులు చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జేసీ సూచించారు. అనంతరం బాలల హక్కుల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో డీఎల్ఎస్ఏ జిల్లా కార్యదర్శి, న్యాయమూర్తి ఎం.వి.శేషమ్మ, డీఆర్వో కె.మోహన్ కుమార్, డీఎల్డీవో పూర్ణిమాదేవి, ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి, దిశ డీఎస్పీ సిహెచ్.వివేకానంద, డీఈవో చంద్రకళ, ఎన్జీఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.